
## తార్నాక స్ట్రీట్ నెం.3 వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా డా. శ్రీరామ్ వెంకటేష్ ఏకగ్రీవ ఎన్నిక



**దశ ఓయూ:** తార్నాక స్ట్రీట్ నెం.3 వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ప్రముఖ సామాజిక సేవకుడు, బీజేపీ నాయకులు డా. శ్రీరామ్ వెంకటేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నిక పట్ల కాలనీ నివాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం జరిగిన నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కాలనీ అపార్ట్‌మెంట్లు, వాణిజ్య సంస్థలు, ఆసుపత్రులు, విద్యాసంస్థల ప్రతినిధులు కాలనీ నివాసులు పెద్ద సంఖ్యలో హాజరై నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన డా. శ్రీరామ్ వెంకటేష్ కాలనీ రూపురేఖలు మార్చేందుకు ప్రతిష్టాత్మక కార్యాచరణను ప్రకటించారు: గత 20 ఏళ్లుగా సరైన సంరక్షణ లేక, అసాంఘిక కార్యకలాపాలకు (ధూమపానం, మాదకద్రవ్యాల వినియోగం) నిలయంగా మారిన స్థానిక పార్కును తన స్వంత నిధులతో ఈ పార్కును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది, ఒక అద్భుతమైన 'ఆయుర్వేద పార్క్'గా మార్చే పనులను ప్రారంభించారు. కాలనీ ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు "కాలనీ సమస్యల డ్రాప్ బాక్స్"ను ఏర్పాటు చేయనున్నారు. తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్, వీధి దీపాలు, పారిశుద్ధ్యం, భద్రత వంటి ఏ సమస్య ఉన్నా కాలనీవాసులు లిఖితపూర్వకంగా ఇందులో వేయవచ్చు. ఈ సమస్యలను అసోసియేషన్ క్రమబద్ధంగా పరిశీలించి, సంబంధిత ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుంటూ పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సాధించిన పురోగతి, భవిష్యత్ ప్రణాళికలను ప్రతి నెలా పారదర్శకంగా ప్రజలకు తెలియజేసేందుకు ఒక ప్రత్యేక "కాలనీ న్యూస్ లెటర్"ను విడుదల చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. తార్నాక స్ట్రీట్ నెం.3 వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం: అధ్యక్షులు డా. శ్రీరామ్ వెంకటేష్,ఉపాధ్యక్షులు అడ్వకేట్ శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి మధు, సంయుక్త కార్యదర్శి మహ్మద్ అస్లాం పాషా,ఖజాంచి వెంకట సుబ్బారావు, కార్యవర్గ సభ్యులు జాయ్, మెర్సీ ఉన్నారు.

## ఓటు హక్కు పరిరక్షణే ప్రజాస్వామ్యానికి బలం

- బిఆర్ ఎస్ నాయకులు మురారి స్మితా కోటేష్ గౌడ్..



**దశ ఓయూ::** ఓటు హక్కు పరిరక్షణే ప్రజాస్వామ్యానికి బలమని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ మహిళ నాయకురాలు మురారి స్మితా కోటేష్ గౌడ్ అన్నారు. సోమవారం మాజీ డిప్యూటీ స్పీకర్ సికింద్రాబాద్ శాసనసభ్యులు తీగుళ్ళ పద్మారావు గౌడ్ ఆదేశాల మేరకు తార్నాక డివిజన్ పలు ప్రాంతాల్లో బిఎల్ద అఖిల తో కలిసి పర్యటించి ఇంటి ఇంటికి తిరుగుతూ ఎస్ఐఆర్ పత్రాలను అందచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రతి అర్హులైన పౌరుడు ఓటరుగా నమోదు కావడం, ఓటరు జాబితాలో తన వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవడం ప్రజాస్వామ్య బలోపేతానికి ఎంతో ముఖ్యమని ఈ సందర్భంగా తెలిపారు. ప్రజలు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఓటరు వివరాలను తప్పకుండా ధృవీకరించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## ఆహార పదార్థాల్లో కల్తీని అరికట్టాలి

- ప్రజల్లో విస్తృత అవగాహన అవసరం.
- హెచ్ ఫాస్ట్ సీఐ రంజిత్ కుమార్ గౌడ్ ను కలిసి కోరిన నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ బృందం.



**దశ ఓయూ:** ఆహార పదార్థాల్లో పెరుగుతున్న కల్తీని అరికట్టేందుకు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం అత్యంత అవసరమని హెచ్ఫాస్ట్ సీఐ రంజిత్ కుమార్ గౌడ్ ను నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ బృందం కలిసి కోరింది. జాతీయ చైర్మన్ డా. సాయి రమేష్ గౌడ్, తెలంగాణ రాష్ట్ర చైర్మన్ సోమ రామ్మోహన్, సౌత్ ఇంచార్జి రాధాకృష్ణ నేతృత్వంలోని ప్రతినిధి బృందం హైదరాబాద్ లోని హెచ్ఫాస్ట్ సీఐ రంజిత్ కుమార్ గౌడ్ ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఫుడ్ అడల్టేషన్, ఆహార భద్రత, వినియోగదారుల హక్కులపై గ్రామాలు పట్టణాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించే అంశంపై చర్చించారు. అనంతరం సీఐ రంజిత్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ కల్తీ ఆహార పదార్థాల వల్ల ప్రజల ఆరోగ్యానికి తీవ్రమైన ముప్పు ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి జిల్లా, ప్రతి గ్రామంలో కల్తీ ఆహారాన్ని గుర్తించే పద్ధతులు, వినియోగదారుల చట్టపరమైన హక్కులపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ దిశగా ది నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ చేపట్టే ప్రజా చైతన్య కార్యక్రమాలకు తమ వంతు సహకారం అందిస్తామని చెప్పారు. జాతీయ చైర్మన్ డా. సాయి రమేష్ గౌడ్, తెలంగాణ రాష్ట్ర చైర్మన్ సోమ రామ్మోహన్, సౌత్ ఇన్చార్జి రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణే తమ సంస్థ ప్రధాన లక్ష్యమన్నారు. ఫుడ్ అడల్టేషన్ నిర్మూలనతో పాటు సురక్షిత ఆహార వినియోగంపై రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అవగాహన సదస్సులు, శిక్షణా కార్యక్రమాలు, విద్యార్థులకు ప్రత్యేక చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. హైదరాబాద్ నగరంలోని కొన్ని హోటళ్లు, రెస్టారెంట్లు,గృహ తయారీ ఆహార ఉత్పత్తుల్లో నాసిరకం, నాణ్యతలేని పదార్థాలు వినియోగిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి పై సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరికి తెలిసే విధంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రతి స్కూల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టవలసిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో. సౌత్ ఇండియా చైర్మన్ డా. నరేష్ ఉన్నారు.

## జాతీయ రహదారిపై "సంపూర్ణం"గా అక్రమ పార్కింగ్..!

- ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటం.. స్పందించని యాజమాన్యం
- చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్



**దశ, పెద్ద అంబర్‌పేట్:** రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని పెద్ద అంబర్‌పేట్ వద్ద జాతీయ రహదారి-65 సర్వీస్ రోడ్డుపై నిత్యం జరుగుతున్న అక్రమ పార్కింగ్ వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. ఔటర్ రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్డుకు ఆనుకుని ఉన్న ఓ హోటల్‌కు వచ్చే వాహనాలన్నింటినీ రహదారిపైనే నిలిపివేయడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుండగా, ప్రమాదాల ముప్పు రోజురోజుకూ పెరుగుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

హోటల్‌కు సొంతంగా పార్కింగ్ స్థలం అందుబాటులో ఉన్నప్పటికీ, దానిని వినియోగించకుండా వాహనాలను జాతీయ రహదారి సర్వీస్ రోడ్డుపైనే వరుసగా పార్క్ చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో సర్వీస్ రోడ్డుపై ప్రయాణించే ద్విచక్ర వాహనాలు, కార్లు, భారీ వాహనాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. రాత్రి వేళల్లో ఈ పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోందని వాహనదారులు చెబుతున్నారు. పలుమార్లు స్థానికులు, ప్రయాణికులు సంబంధిత యాజమాన్యానికి ఈ విషయాన్ని తెలియజేసినా ఎలాంటి మార్పు కనిపించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల భద్రత కంటే వ్యాపార ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జాతీయ రహదారిపై ఇష్టారాజ్యంగా వాహనాలు నిలిపివేయడం వల్ల అత్యవసర సేవలకు ఆటంకం కలిగే అవకాశం ఉందని, ముఖ్యంగా అంబులెన్స్‌లు, అగ్నిమాపక వాహనాలు, ఇతర అత్యవసర వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

అంతేకాకుండా జాతీయ రహదారులపై అక్రమ పార్కింగ్ నిబంధనలకు విరుద్ధమని, అయినప్పటికీ సంబంధిత అధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

జాతీయ రహదారి అధికారులు, ట్రాఫిక్ పోలీసులు, స్థానిక పోలీసు శాఖ వెంటనే స్పందించి అక్రమ పార్కింగ్‌ను పూర్తిగా నివారించేలా చర్యలు చేపట్టాలని, రహదారిని ఆక్రమించి వాహనాలు నిలిపే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని స్థానికులు, వాహనదారులు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు.

## నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం

- ఎల్‌బీ నగర్ ఏసీపీ కృష్ణయ్య
- "నేను సైతం 2.0"లో భాగంగా 54 సీసీటీవీ కెమెరాల ప్రారంభం



**దశ, పెద్ద అంబర్ పేట :** నేరాల నియంత్రణ, నేరస్థుల గుర్తింపు, దర్యాప్తులో సీసీటీవీ కెమెరాలు అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నాయని ఎల్‌బీ నగర్ ఏసీపీ కృష్ణయ్య అన్నారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న "నేను సైతం 2.0" కార్యక్రమంలో భాగంగా నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తట్టి అన్నారం డబుల్ బెడ్‌రూమ్ గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్‌లో ఏర్పాటు చేసిన 54 సీసీటీవీ కెమెరాలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ కృష్ణయ్య మాట్లాడుతూ, సీసీటీవీ కెమెరాలు నేరాల నివారణతో పాటు నేరస్థులను గుర్తించడంలో, దర్యాప్తుకు కీలక ఆధారాలను అందించడంలో ఎంతో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ నివాస ప్రాంతాల్లో సీసీటీవీ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు.

తట్టి అన్నారం డబుల్ బెడ్‌రూమ్ గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్‌లోని నాలుగు బ్లాకుల నివాసితులు తమ సొంత వ్యయంతో 54 సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయడం ఆదర్శనీయమని కొనియాడారు. ప్రతి కాలనీ, అపార్ట్‌మెంట్, వాణిజ్య సంస్థలు సీసీటీవీ నిఘా వ్యవస్థలను ఏర్పాటు చేసుకుని సురక్షిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజల భాగస్వామ్యంతోనే నేరాల నియంత్రణ మరింత సమర్థవంతంగా సాధ్యమవుతుందని, పోలీసులకు ప్రజల సహకారం ఎంతో అవసరమని ఏసీపీ కృష్ణయ్య పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాగోల్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్ జానీ, ఎస్ఐ శివ నాగ ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేవిడి వేణుగోపాల్ రెడ్డి, బ్లాక్ ఇన్‌చార్జ్‌లు రిజ్వాన్, భాస్కర్, దేవేందర్, మొహమ్మద్ ఖాతీజా బేగం తదితరులు పాల్గొన్నారు.

## దుకాణాల్లో చోరీకి విఫలయత్నం



**దశ, అబ్దుల్లాపూర్ మెట్ :** అబ్దుల్లాపూర్‌మెట్ బస్‌స్టాప్ సమీపంలోని ఓ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి యత్నించిన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామానికి చెందిన మహ్మద్ నదీమ్ (28), బీ.టెక్ బైట్స్ ఫాస్ట్ ఫుడ్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. ఆదివారం (జూలై 5) రాత్రి సుమారు 11.30 గంటలకు దుకాణాన్ని మూసివేసి ఇంటికి వెళ్లాడు. సోమవారం ఉదయం సుమారు 6.40 గంటలకు దుకాణంలో పనిచేసే కాథి పల్లవి ఫోన్ చేసి, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ పైకప్పులోని స్టీల్ షీట్‌ను కత్తిరించి గుర్తు తెలియని వ్యక్తులు లోపలికి ప్రవేశించినట్లు సమాచారం ఇచ్చింది. దుకాణానికి చేరుకున్న యజమాని పరిశీలించగా, దుండగులు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో చోరీకి యత్నించడంతో పాటు పక్కనే ఉన్న పవన్ బ్రోకర్స్ దుకాణంలోకి వెళ్లేందుకు గోడకు రంధ్రం చేసి అక్కడ కూడా చోరీకి ప్రయత్నించినట్లు గుర్తించారు. అయితే దుండగులు ఎలాంటి నగదు లేదా వస్తువులు అపహరించకుండా వెళ్లిపోయినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుల కోసం దర్యాప్తు చేపట్టారు. పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తూ నిందితులను గుర్తించే పనిలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

## అంబేద్కర్ చౌరస్తాలో ఏటీఎం ఏర్పాటు.. అధికారులపై ప్రజల ఆగ్రహం

- రోడ్డు విస్తరణ మరిచి అద్దెలకే ప్రాధాన్యమా?.. మున్సిపల్ అధికారుల తీరుపై విమర్శలు

**దశ, హుజురాబాద్ (పడాల రమేష్) :** హుజురాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఏటీఎం సెంటర్ వివాదానికి కేంద్రబిందువుగా మారింది. పట్టణానికి చెందిన ఓ వ్యాపారవేత్త మున్సిపల్ అధికారులతో కుమ్మక్కై ప్రభుత్వ స్థలంలో డబ్బా ఏర్పాటు చేసి, దానిని ఓ ప్రైవేట్ ఏటీఎం సంస్థకు భారీ అద్దెకు ఇచ్చారంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు. అత్యంత రద్దీగా ఉండే అంబేద్కర్ చౌరస్తాలో ఇప్పటికే ట్రాఫిక్ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, రోడ్డు విస్తరణ చేపట్టి ప్రజలకు సౌకర్యం కల్పించాల్సిన అధికారులు అందుకు విరుద్ధంగా వాణిజ్య ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ప్రభుత్వ స్థలం కేటాయింపులో నిబంధనలు పాటించారా? మున్సిపల్ కౌన్సిల్ అనుమతి ఉందా? వేలం ప్రక్రియ నిర్వహించారా? ఎవరికి లబ్ధి చేకూర్చేందుకు ఈ ఏర్పాట్లు చేశారనే అంశాలపై సమగ్ర విచారణ జరపాలని పట్టణవాసులు డిమాండ్ చేస్తున్నారు.

అంబేద్కర్ చౌరస్తా ప్రజల రాకపోకలకు కీలక కూడలి కావడంతో అక్కడ శాశ్వత నిర్మాణాలు చేపట్టడం వల్ల భవిష్యత్తులో ట్రాఫిక్ సమస్యలు మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని పూర్తి స్థాయి విచారణ నిర్వహించి, అక్రమాలు జరిగి ఉంటే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

*టౌన్ ప్లానింగ్ అధికారి అభినవ్ ను వివరణ కోరగా గా ఈ సమస్య తమ దృష్టికి వచ్చింది. పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



## వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను పోషించని కొడుకు, మనుమల పై ఆర్డీఓ కు ఫిర్యాదు

- మోసగించి భూమినీ కాజేసిన మనుమల నుంచి తిరిగి భూమి ఇప్పించాలని ఆర్డీవో ను వేడుకున్నా వృద్ధులు..



**దశ హుజురాబాద్ (పడాల రమేష్) :** వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను పోషించని ఓ కొడుకు, మనుమల పై ఆర్డీఓ కు వృద్ధాప్యం, దానికి తోడు పక్షవాతంతో బాధపడుతున్న వృద్ధ దంపతులు సోమవారం ఫిర్యాదు చేయడం పలువురిని కలచివేసింది. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.

రెక్కలు ముక్కలు చేసుకొని సాది పెద్ద చేసిన తల్లిదండ్రులను కన్న కొడుకు, వారి వారసులైనా కొడుకులు పట్టించుకోక పోగా తండ్రి లేదని మనుమలను సాది, పెద్ద చేసి అప్పులు చేసి మరీ ఉన్నత చదువులు చదివించి అప్పుల పాలైన ఆ వృద్ధులను సాధకపోగా వారి పేరున ఉన్న విలువైన భూమిని కాజేసి నిర్లక్ష్యంగా వదిలివేసి మోసం చేసిన మనుమలు వ్యవహరిస్తున్న తీరు అత్యంత బాధాకరం. అంతేగాక వృద్ధాప్యంలో ఆసరాగా ఉంటుందని కొనుగోలు చేసిన భూమిని మోసగించి నామిని అయిన తాతకు తెలియకుండా ఆ భూమి ముగ్గురు మనుమలు కాజేశారని, మనుమల నుంచి తిరిగి తన భూమి తనకు ఇప్పించాలని ఆర్డీవో ను ఆ వృద్ధులు వేడుకుంటున్నారు. హుజురాబాద్ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన ముషం వీరమల్లు, అతని భార్య ముషం బుచ్చి మల్లమ్మలు అనారోగ్యంతో బాధపడుతున్నప్పటికీ ఆర్డిఓ కార్యాలయానికి చేరుకొని తమ గోడును వెళ్లబోసుకున్నారు.

వృద్ధాప్యంలో కన్న తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయడం, మోసగించి ఆస్తిని లాక్కోవడం చట్టరీత్యా నేరం అయినప్పటికీ, మన దేశంలో వృద్ధుల రక్షణ కోసం "తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్ల పోషణ, సంక్షేమ ఫిర్యాదు చేసి న్యాయం పొందవచ్చునన్న ఆశతో వారు ఆర్డిఓను కలిసేందుకు వచ్చామన్నారు. తాతకు తెలియకుండా భూమిని రీ రిజిస్ట్రేషన్ చేసుకున్న మనుమలు.. ఆస్తిని తిరిగి (సెక్షన్ 23) అప్పగించాలని వేడుకలు:

వృద్ధుల సంరక్షణ చూసుకుంటారనే నమ్మకంతో కొన్నేళ్ల క్రితం ఈ వృద్ధ దంపతులు వీరమల్లు, బుచ్చి మల్లమ్మలు రాంపూర్ గ్రామానికి సమీపంలో ఉండే జమ్మికుంట ప్రధాన రహదారికి రెండవ బిట్టు సర్వే నెంబర 170/బి లో 322.43 చదరపు గజాల ఫ్లాట్ ను కొనుగోలు చేసి ముషం వీరమల్లు(తాత) నామినిగా ఉండి కొడుకు(చిన్న కొడుకు చనిపోగా) కొడుకులు అయినా మనవళ్ళు ముగ్గురు ముషం ప్రదీప్, అరవింద్, ప్రశాంత్ పేరిట ఆస్తిని (భూమిని) రిజిస్ట్రేషన్ చేశామన్నారు. కానీ ఆ ముగ్గురు తాతకు తెలవకుండా కొన్ని నెలల క్రితం రీ రిజిస్ట్రేషన్ ముగ్గురి పేరున మార్చి చేసుకున్నారని వీరమల్లు పేర్కొన్నారు. అయినా ఆ ఒరిజినల్ భూమి పట్టా కాగితాలు తన వద్దే ఉన్నాయన్నారు. గత ఎనిమిది సంవత్సరాలుగా వారు తాత, నానమ్మలను పట్టించుకోవడం లేదన్నారు. చిన్న మనవడు ముషం ప్రశాంత్ ను చదివించేందుకు రూ. 6,39,000 అప్పులు చేసి ఉన్నత చదువులు చదివించగా ప్రస్తుతం ఎల్ఐసి డెవలప్మెంట్ ఆఫీసర్ గా కొనసాగుతూ ప్రశాంత్ తమను ఏనాడు పట్టించుకోవడం లేదన్నారు. తమకు తెలియకుండానే ముగ్గురు మనుమలు దొంగతనముగా రీ రిజిస్ట్రేషన్ చేసుకున్న ఆ భూమిని తిరిగి తన పేరున మార్చాలని వీరమల్లు ఆర్డిఓ కు విజ్ఞప్తి చేశారు.ఆస్తి బదిలీని చెల్లనిదిగా మోసగించి రీ రిజిస్ట్రేషన్ చేసుకున్న భూమిని తిరిగి వృద్ధుల పేరిట మార్చాలని చూడతల్లిదండ్రులను సంరక్షించని కొడుకు, సంపాదన కలిగిన మనవళ్ల నుంచి వృద్ధులకు నెలవారీ పోషణ ఖర్చులు (గరిష్టంగా రూ. 10,000 లేదా కోర్టు ఆదేశాల ప్రకారం) ఇప్పించేలా ఆర్డిఓ ఆదేశాలు జారీ చేయాలని వారు ఆర్డిఓ కు ఇచ్చిన వినతి పత్రంలో వేడుకున్నారు.